క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మీర్‌పేట: విద్యుత్ మరమ్మతుల కారణంగా శుక్రవారం పలు కాలనీలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని మీర్‌పేట ఏఈ బాలాగౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ కేశవరెడ్డి ఫీడర్ పరిధిలోని టీఎస్ఆర్ నగర్, ప్రశాంతిహిల్స్ రోడ్ నెం–1, 2, రాఘవేంద్రనగర్, మీర్‌పేట పోస్టాఫీస్, మీర్‌పేట పోలీస్‌స్టేషన్, సీతాహోమ్స్‌లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు. 11కేవీ వాంబేకాలనీ ఫీడర్ పరిధిలోని లలితానగర్, విజయహోమ్స్, వెంకటాద్రినగర్, రాఘవేంద్రనగర్, వాంబేకాలనీ, ఆదిత్యనగర్, వీరమణికాలనీ, జేఎస్ఎస్‌యూఆర్ఎం కాలనీల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నామని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఘనంగా సహకార వారోత్సవాలు


పీఏసీఎస్ కార్యాలయం ఎదుట జెండా ఆవిష్కరిస్తున్న చైర్మన్ తదితరులు

కందుకూరు: మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయం వద్ద 71వ సహకార వారోత్సవాలను పురస్కరించుకొని పీఏసీఎస్ చైర్మన్ డి.చంద్రశేఖర్, వైస్ చైర్మన్ జి.విజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం సహకార జెండాను ఆవిష్కరించి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సహకార స్ఫూర్తితో సభ్యులందరూ అభివృద్ధి పథంలో నడవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు సురసాని శేఖర్‌రెడ్డి, నర్ల నర్సింహ, సత్తినేని వెంకట్రామిరెడ్డి, సాధ పాండురంగారెడ్డి, మెగావత్ చంద్రునాయక్, జిల్లా సహకార బ్యాంక్ డైరెక్టర్ పాట్టి ఆనంద్, సంఘ కార్యదర్శి నిమ్మ యాదగిరిరెడ్డి, సిబ్బంది కాల మహేశ్, శంకరి పర్వతాలు, మంచాల రాకేశ్, మేక కీర్తి, సభ్యులు సురసాని రవీందర్‌రెడ్డి, వేముల శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం


సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ రాంచందర్

మీర్‌పేట: మీర్‌పేట కార్పొరేషన్ 43వ డివిజన్ ఓంకార్‌నగర్ కాలనీలో రూ.25 లక్షలతో చేపట్టనున్న సీసీరోడ్డు పనులను గురువారం కార్పొరేటర్ గజ్జెల రాంచందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకోవడంతో పాటు ప్రజలకు ఇబ్బందులు కలగకుండా రోడ్డు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ పోరెడ్డి భాస్కర్‌రెడ్డి, నాయకులు సిద్దాల శ్రీశైలం, సుర్వి యాదగిరిగౌడ్, మిరియాల భాస్కర్, బొడ్డు సత్తయ్య, ఉదయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సరూర్‌నగర్ ఓల్డ్ పోస్టాఫీస్ చౌరస్తా పరిశీలన


కూడలిని పరిశీలిస్తున్న హేమంత్ కేశవ్ పాటిల్, అధికారులు

హుడాకాంప్లెక్స్: ఇరుకు రోడ్డును విస్తరించాలని కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి అభ్యర్థన మేరకు గురువారం జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ హేమంత కేశవ్‌పాటిల్, సరూర్‌నగర్ సర్కిల్ ఉప కమిషనర్ సుజాత సరూర్‌నగర్ పాత పోస్టాఫీస్ చౌరస్తాను అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం టౌన్ ప్లానింగ్ ఏసీపీ ప్రతాప్, ఇంజినీరింగ్ టీమ్ ఈఈ శ్రీనివాసులకు 100 అడుగుల రోడ్డు విస్తరణ అంచనా వేయాలని సూచించారు. లింగోజిగూడ కార్పొరేటర్ ధర్పల్లి రాజశేఖర్‌రెడ్డి సరూర్‌నగర్‌లోని పాత నివాసితులు, శానిటేషన్ డీఈ చందన, సిబ్బంది పాల్గొన్నారు.

ఓటు నమోదుకు మరో అవకాశం

- 18 ఏళ్లు నిండిన వారు అర్హులు
- పోలింగ్ కేంద్రాల్లో బీఎల్ఓలు, ఆన్‌లైన్‌లోనూ మార్పులు చేర్పులకు ఛాన్స్
- ఈ నెల 28 వరకు తుది గడువు


ఫరూఖ్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ సరిత

షాద్‌నగర్: గత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు వేసేందుకు ఆసక్తి కనబరిచినా ఓటరు జాబితాలో పేరులేక చాలా మంది నిరాశతో వెనుదిరిగారు. అలాంటి వారందరినీ ఓటరు జాబితాలో నమోదు చేసేందుకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. దీంతో రానున్న పంచాయతీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటు వేసేందుకు అవకాశం దక్కనుంది. ఓటరు జాబితా సవరణలో భాగంగా ఎన్నికల సంఘం ఓటరుగా నమోదు, మార్పులు చేర్పులు, చనిపోయిన వ్యక్తుల పేర్ల తొలగింపునకు ఎన్నికల సంఘం ఈ నెల 28వ తేదీవరకు అవకాశం కల్పించింది.

అందుబాటులో బీఎల్ఓలు

ఓటరు జాబితాలో పేరు లేనివారు, పేర్లు గల్లంతైన వారు నమోదు చేసేందుకు, రెండు మూడుచోట్ల పేరు వచ్చినా తొలగించుకునేందుకు వెసులుబాటు కల్పించారు. ఇందుకు అన్ని పోలింగ్ కేంద్రాల్లో బూత్ లెవల్ అధికారుల(బీఎల్ఓలు)ను నియమించారు. పోలింగ్ కేంద్రాలోనే బీఎల్ఓలు దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. అదేవిధంగా అధికారులు గ్రామాల్లో, పట్టణాల్లో ఓటు నమోదుపై అవగాహన కల్పిస్తున్నారు. ముఖ్య కూడళ్లు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు.

కొత్తగా ఓటు హక్కు కోసం

1 జనవరి 2025 నాటికి 18 ఏళ్లు నిండే యువతీ, యువకులు కొత్తగా ఓటు నమోదు చేసుకునే వారు ఫారం 6 ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. రెండు పాస్‌పోర్టు సైజు కలర్ ఫొటోలు, నివాస, వయస్సు, ధ్రువీకరణ పత్రాలతో బీఎల్ఓలకు దరఖాస్తులు అందజేయాలి లేదా ఆన్‌లైన్‌లో కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ నెల 28వ తేదీవరకు ఎన్నికల సంఘం దరఖాస్తు చేసుకునేందుకు అవకాశాన్ని కల్పించింది.

పేర్ల తొలగింపు కోసం

స్థానికంగా లేక ఓటర్ల పేర్లను తొలగించేందుకు ఫారం–7ను ఉపయోగించాలి. అదేవిధంగా వలస వెళ్లిన వారు ఒకరికి రెండు చోట్ల ఓటరు జాబితాలో పేరు ఉంటే లేదా చనిపోయిన వారి పేర్లను తొలగించేందుకు ఈ ఫారంను ఉపయోగించాలి.

మార్పులు, చేర్పులు ఇలా

ఫారం–8 ద్వారా ఓటరు పేరు, పుట్టిన తేదీ, చిరునామా, వంటి మార్పులు, చేర్పులు చేసుకోవచ్చు. ఒక పోలింగ్ కేంద్రం నుంచి మరో ప్రాంతానికి మార్పు చేసుకోవడంతో పాటుగా గతంలో ఓటరుగా నమోదై ఉండి వైకల్య ధ్రువీకరణ లేకుంటే దివ్యాంగులుగా ఫారం–8 ద్వారా నమోదు చేసుకోవచ్చు.

ఆన్‌లైన్‌లోనూ అవకాశం

ఓటరుగా దరఖాస్తు చేసుకోవాలనేకునేవారు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. www. nvsp.in వెబ్‌సైట్‌లో ఓటరుగా నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. దరఖాస్తుదారులు స్పష్టమైన చిరునామా, ఫోన్ నెంబర్‌తో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. వచ్చిన దరఖాస్తులన్నింటినీ బీఎల్ఓలు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారు.

అర్హులందరూ చేసుకోవాలి



కొత్తగా ఓటు హక్కు కోసం, జాబితాలో మార్పులు చేర్పుల కోసం ఎన్నికల సంఘం మరోసారి అవకాశం కల్పించింది. ఈ అవకాశాన్ని అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలి. దరఖాస్తులను పోలింగ్ కేంద్రాల్లో బీఎల్ఓలు స్వీకరిస్తున్నారు. లేదంటే ఆన్‌లైన్ ద్వారా చేసుకోవచ్చు.

– ఎస్ఆర్ సరిత, ఆర్డీఓ, షాద్‌నగర్


తుక్కుగూడ: వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు



బడంగ్‌పేట్: విద్యార్థినులు ఏర్పాటు చేసిన ఫుడ్ స్టాల్స్

ఘనంగా బాలల దినోత్సవం

తుక్కుగూడ: బాలల దినోత్సవం ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పుర పరిధిలోని ఇమామ్‌గూడ ప్రాథమిక పాఠశాలలో గురువారం మాజీ ప్రధాని నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు ఆ పాఠశాల హెచ్ఎం లక్ష్మీకుమారి, ఇంజినీర్ సునీల్‌రెడ్డిలు తమ సొంత ఖర్చులతో బహుమతులను ప్రదానం చేశారు. తుక్కుగూడ జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల హెచ్ఎం రాములు, బంటు శ్రీలత, సిబ్బంది బాల్‌రాజ్, అనిత తదితరులు పాల్గొన్నారు.

వివిధ వేషధారణలో..

బడంగ్‌పేట్: బడంగ్‌పేట కార్పొరేషన్ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో బాలల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకొన్నారు. విద్యార్థులు దేశ నాయకుల వేషధారణలో తరలివచ్చి అబ్బురపరిచారు. మరికొన్ని పాఠశాలల్లో విద్యార్థులే స్టాల్స్ ఏర్పాటు చేసి లాభ నష్టాల గురించి తెలుసుకున్నారు. ఆటల పోటీల్లో ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేశారు. బాలల దినోత్సవ ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు.

కార్పొరేటర్‌కు విశ్వబ్రాహ్మణ లీడర్ అవార్డు


అవార్డు అందుకుంటున్న బిక్షపతిచారి

మీర్‌పేట: కార్పొరేషన్ 27వ డివిజన్ కార్పొరేటర్ పసునూరి బిక్షపతిచారి 2024 సంవత్సరానికి గాను విశ్వబ్రాహ్మణ లీడర్ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ మేరకు ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో జరిగిన పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి జయంతిలో ఎంపీలు ఈటెల రాజేందర్, మల్లు రవి, బీసీ కమిషన్ జాతీయ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి, మాజీ స్పీకర్ మధుసూదనాచారి చేతుల మీదుగా అవార్డును అందుకున్నట్లు బిక్షపతి తెలిపారు. ఈ అవార్డు రావడం ఎంతో గర్వంగా ఉందని, దీంతో తనపై మరింత బాధ్యత పెరిగిందని ఆయన తెలిపారు.

సమయానుకూలంగా బస్సులు నడపాలి

డిపో అసిస్టెంట్ మేనేజర్‌కు బాచుపల్లి గ్రామస్తుల వినతి


డిపో అసిస్టెంట్ మేనేజర్‌కు వినతిపత్రం అందిస్తున్న గ్రామస్తులు

కందుకూరు: విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా ఆర్టీసీ బస్సు సర్వీసులను సమయానుకూలంగా నడపాలని కోరుతూ బాచుపల్లి గ్రామస్తులు మాజీ సర్పంచ్ యాలాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో గురువారం మహేశ్వరం డిపో అసిస్టెంట్ మేనేజర్ అంజమ్మకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. ఇప్పటివరకు గ్రామం వరకు నడిచిన ఆర్టీసీ బస్సు సర్వీసును గత కొంత కాలంగా మురళీనగర్ వరకు పొడిగించారన్నారు. దీంతో గ్రామం నుంచి నేదునూరు మోడల్ స్కూల్‌కు వెళ్లే విద్యార్థులతో పాటు ప్రయాణికులకు ఇబ్బందికరంగా మారిందన్నారు. ఉదయం 9 గంటలకు బాచుపల్లి వరకు ఒక సర్వీసు, తిరిగి సాయంత్రం 4 గంటల వరకు మరొక సర్వీసును వేయాలని కోరారు. వెంటనే సమస్య పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని అసిస్టెంట్ మేనేజర్ వారికి హామీ నిచ్చారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు ఆరోగ్యరెడ్డి, థామస్‌రెడ్డి, ఎర్ర ప్రభు, కత్తుల శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

సర్వేను పారదర్శకంగా నిర్వహించాలి

కమిషనర్ వాణి


సర్వేను పరిశీలిస్తున్న కమిషనర్ వాణి

తుక్కుగూడ: కులగణనను పారదర్శకంగా నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్ వాణి ఎన్యుమరేటర్లకు సూచించారు. గురువారం పుర పరిధిలోని దేవేందర్‌నగర్‌కాలనీలో కొనసాగుతున్న సమగ్ర కుటుంబ సర్వేను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. మున్సిపాలిటీలో సర్వేకు ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తుందన్నారు. సమగ్ర సర్వేతో అందరికీ న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ సర్వేకు సహకరించి, సిబ్బందికి పూర్తి వివరాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో మేనేజర్ పర్వతాలు, సీనియర్ అసిస్టెంట్ వెంకటేశ్, మల్లేశ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా గురువారం బడంగ్‌పేట లైబ్రరీలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న మేయర్ పారిజాత, గ్రంథాలయ చైర్మన్ మధుసూదన్, కార్పొరేటర్ సుదర్శన్ రెడ్డి తదితరులు

రోడ్డు సమస్య పరిష్కరించండి


కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

బడంగ్‌పేట్: గుంతలమయమైన రహదారి సమస్యను పరిష్కరించాలని కోరుతూ.. బీజేపీ నాయకులు కమిషనర్ సరస్వతికి వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. కార్పొరేషన్ పరిధి నాదర్‌గుల్ బస్టాండ్ నుంచి గ్రీన్ హోమ్స్ కాలనీ వరకు రోడ్డు అధ్వానంగా మారిందని, దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా ఉందని పేర్కొన్నారు. రోడ్డు మరమ్మతుకు చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు రాంరెడ్డి, సింగిల్ విండో మాజీ చైర్మన్ పుల్లారెడ్డి, బ్యాంక్ డైరెక్టర్లు ప్రతాప్‌రెడ్డి, తిరిపతిగిరి, బీజేవైఎం కార్పొరేషన్ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, రవికాంత్‌గౌడ్, శ్రీశైలం, శ్రీధర్, యాదిరెడ్డి, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఉమామహేశ్వరస్వామికి లక్ష పత్రిపూజ


స్వామివారికి హారతి ఇస్తున్న అర్చకులు

హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్ డివిజన్‌లోని వేంకటేశ్వరకాలనీలో గల వేంకటేశ్వరస్వామి దేవాలయంలో 40వ బ్రహ్మోత్సవాల సందర్భంగా గురువారం ఉమామహేశ్వర స్వామివారికి వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య లక్ష పత్రిపూజ ఘనంగా నిర్వహించారు. దేవాలయ ఆవరణ శివనామస్మరణతో మార్మోగింది. అనంతరం భక్తులు స్వామివారికి పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కొరుపోలు భాస్కర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి శాంతిప్రసాద్, మాజీ చైర్మన్ గండు ధనంరెడ్డి, కమిటీ సభ్యులు బొగేశ్వర్‌రావు, సుబ్బారావు, శ్రీమన్నారాయణ, శ్రీనివాస్‌రావు, ప్రతాప్‌రెడ్డి, మహేందర్, ఆలయ సభ్యులు రవీందర్‌రావు, వీరేందర్‌రెడ్డి, రాజశేఖర్, భక్తులు పాల్గొన్నారు.

పాఠశాలకు క్రీడా పరికరాలు


క్రీడా పరికరాలను అందజేస్తున్న కార్పొరేటర్ మాధవి

మీర్‌పేట: బాలల దినోత్సవం సందర్భంగా మీర్‌పేట సిర్లాహిల్స్‌లోని ప్రభుత్వ పాఠశాలకు 45వ డివిజన్ కార్పొరేటర్ అక్కి మాధవి క్రీడా పరికరాలను బహూకరించారు. ఈ సందర్భంగా మాధవి మాట్లాడుతూ.. చదువుతో పాటు క్రీడలు ఎంతో అవసరమని, తన వంతు బాధ్యతగా క్రీడల్లో విద్యార్థులను ప్రోత్సహించేందుకు క్రీడా పరికరాలను అందజేసినట్లు తెలిపారు. క్రీడల్లో ఆసక్తి ఉన్న బాలికలకు తన సొంత ఖర్చుతో శిక్షణ ఇప్పిస్తానని, దీనికి తల్లిదండ్రులు కూడా ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం కాంతారావు, ఉపాధ్యాయులు, నాయకులు ఈశ్వర్, రఘు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్


మహేశ్వరం: చెక్కు అందజేస్తున్న కేఎల్లార్

మహేశ్వరం: పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. మహేశ్వరం గ్రామానికి చెందిన రాజమల్లయ్య ఆరోగ్య సమస్యలతో ఆస్పత్రిలో చికిత్స పొందాడు. వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకోగా.. రూ.60 వేల చెక్కు మంజూరు అయింది. ఈ మేరకు కేఎల్లార్ గురువారం బాధితుడికి చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎంఆర్ఎఫ్ పేదలకు వరమన్నారు. ఎవైనా ఆరోగ్య సమస్యలు తలెత్తినప్పుడు కార్పొరేట్ ఆస్పత్రిలో వైద్యం చేయించుకునేందుకు సీఎం సహాయ నిధికి అర్జీ పెట్టుకోవాలని సూచించారు. జెడ్పీ ఫ్లోర్ లీడర్ మాజీ సభ్యుడు జంగారెడ్డి, పీసీసీ సభ్యుడు భాస్కర్‌రెడ్డి, అమరేందర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు దశరథ, పార్టీ సీనియర్ నాయకులు రాజు నాయక్, లక్ష్మీనారాయణ, మురళీధర్ రెడ్డి, ఐఎన్‌టీయూసీ మండల అధ్యక్షుడు శివకుమార్, శేఖర్, శశికాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తుక్కుగూడలో..

తుక్కుగూడ: సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరంలాటిందని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కేఎల్లార్ అన్నారు. గురువారం మున్సిపాలిటీలోని పార్టీ కార్యాలయంలో ఆయన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న నిరుపేదలకు ఈ పథకం ద్వారా ఆర్థిక లబ్ధి చేరుకూరుతుందన్నారు. నియోజకవర్గంలో అర్హులైనవారు తమ వద్ద దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ చెక్కులను జిల్లా ఇన్‌చార్జి డి.శ్రీధర్ సహకారంతో అందజేశామన్నారు. ఆయనకు లబ్ధిదారుల తరఫున కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డి, ఇతర నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్


కొత్తూరులో బీటీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య

కొత్తూరు: గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మున్సిపాలిటీలో గురువారం ఆయన పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. హెచ్ఆర్డీసీఎల్ ద్వారా మంజూరైన రూ.18కోట్ల నిధులతో కొత్తూరు వైజంక్షన్ నుంచి వినాయక స్టీల్ వరకు, రూ.32కోట్లతో కొత్తూరు రైల్వే క్రాసింగ్ నుంచి కుమ్మరిగూడ వరకు చేపట్టనున్న బీటీరోడ్ల పనులకు ఆయన పలువురు నాయకులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం మాదిరిగా హామీలు ఇచ్చి చేతులు దులుపుకోకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను తప్పకుండా అమలు చేస్తుందన్నారు. ఆయా మార్గాల్లో రోడ్లు చాలా ఏళ్లుగా నిర్వహణ, మరమ్మతులు లేక గుంతలమయంగా మారినట్లు స్థానిక నాయకులు తన దృష్టికి తేవడంతో నిధులు మంజూరుకు కృషి చేసినట్లు తెలిపారు. వ్యాపారులు, ఇళ్లకు ఎలాంటి ఇబ్బందులు, నష్టాలు లేకుండా రోడ్ల విస్తరణ పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. రోడ్ల అభివృద్ధి పనులకు వ్యాపారులు, నాయకులు సహకరించాలని కోరారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కులగణనతో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు ప్రయోజనం ఉంటుందని తెలిపారు. సర్వేకు వచ్చే సిబ్బందికి ప్రజలు సహకరించాలని సూచించారు. అనంతరం కుమ్మరిగూడలో నిర్వహించిన బాలల దినోత్సవంలో పాల్గొని చిన్నారులకు విద్య ప్రాముఖ్యతను తెలియజేశారు. అనంతరం ఎంపీడీఓ కార్యక్రమంలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య, వైస్ చైర్మన్ రవీందర్, నాయకులు సుదర్శన్‌గౌడ్, వీరమోని దేవేందర్‌ముదిరాజ్, కర్రోళ్ల సురేందర్, హరినాథ్‌రెడ్డి, ప్రభాకర్, శేఖర్‌రెడ్డి, దేవేందర్‌యాదవ్, కౌన్సిలర్లు, తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, ఎంపీడీఓ అరుంధతి, కాంగ్రెస్ కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

దాతల సాయం అభినందనీయం

విద్యారంగ అభివృద్ధికి దాతలు చేస్తున్న సాయం అభినందనీయమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. పట్టణంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్మాణానికి దాతలు స్వచ్ఛందంగా ముందుకు రావడం సంతోషకరమన్నారు. స్వస్తిక్ మిర్చి సంస్థ నిర్వాహకులు కళాశాల నిర్మాణానికి రూ.25లక్షలు ఇవ్వడంపై ఆయన సంస్థ యజమానులకు అభినందనలు తెలిపారు. గత పాలకులు సొంత ప్రయోజనాల కోసం విరాళాలు సేకరించగా తాను ప్రజాప్రయోజనాలు, పేద విద్యార్థులను దృష్టిలో పెట్టుకొని కళాశాల నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. దాతల సాయంతో పాటు తాను సహకరించి త్వరలో జూనియర్ కళాశాల భవనాన్ని అత్యాధునిక సదుపాయాలతో అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు.

నేటి నుంచి న్యాయం.. సమానత్వం


మాట్లాడుతున్న జీఐహెచ్ ప్రతినిధులు

పహాడీషరీఫ్: న్యాయం– సమానత్వం ప్రధాన అంశాలుగా ఈ నెల 15వ తేదీ నుంచి 17వ వరకు పహాడీషరీఫ్ వాదియే హుదా మైదానంలో మూడు రోజుల పాటు 5వ జాతీయ సభ్యుల సమావేశం నిర్వహించనున్నట్లు జమాతే ఎ ఇస్లామీ హింద్(జీఐహెచ్) సమావేశాల చీఫ్ ఆర్గనైజర్ అబ్దుల్ జబ్బార్ సిద్దిఖీ తెలిపారు. గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇస్లామీ హింద్ అనేది పాన్– ఇండియా సంస్థ అని, దేశాభివృద్ధికి, న్యాయం, సమానత్వ సాధన కోసం దైవోపదేశాల వెలుగులో 75 ఏళ్లుగా జీఐహెచ్ పోరాడుతుందని పేర్కొన్నారు. సంస్థ స్థాపించినప్పటి నుంచి సభ్యుల సుశిక్షణ కోసం ఎప్పటికప్పుడు వివిధ స్థాయిలో సమావేశాలు నిర్వహిస్తుందని తెలిపారు. ఆధ్యాత్మిక వికాసం, సరైన ధార్మిక అవగాహన, విద్యా సంస్థల ఏర్పాటు, సామాజిక అభివృద్ధి, విలువ ఆధారిత రాజకీయాలు, నీతివంతమైన ఆర్థిక వ్యవస్థ మొదలైనవి ఈ సమావేశాల్లో చర్చిస్తామని వెల్లడించారు. ఇందులో తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక నుంచి వేలాది మంది హాజరవుతారని చెప్పారు. జీఐహెచ్ జాతీయ అధ్యక్షుడు మౌలానా జలాలుద్దీన్ ఉమరీ, ఉపాధ్యక్షుడు అమీనుల్ హసన్, సలీం, సల్మాన్ అహ్మద్ ఉన్నారు.